# పాపం వెనకబడ్డవాడు!



మధ్యాహ్న సమయం, వేసవికాలం. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. ఒక సందులో నడుస్తున్నాను.

వెనకాల ఎవరో అబ్బాయి వస్తున్నాడు. అడుగుల సవ్వడి వినిపిస్తోంది. ఎవరో అబ్బాయి నన్ను అనుసరిస్తున్నాడు. ఇది బస్‌రూట్ కాదు. ఇంటికి వెళ్ళాలంటే ఇంకా నడవాలి. ఇంటిదాకా అనుసరిస్తాడా ఏమిటి? ఈ ఆలోచన రాగానే భయం వేసింది

వేగాన్ని పెంచాను. అతను కూడా వేగాన్ని పెంచాడు. అతని నడక శబ్దం దగ్గరౌతోంది. నా గుండెవేగం పెరుగుతుంది. శబ్దం ఇంకా దగ్గరైంది. 'ఏమండి' పిలిచాడు. ఎంత వినయంగా పిలుస్తున్నాడు. అమ్మో ఈ సిటీ అబ్బాయిలను నమ్మకూడదు. ఎన్ని కథలు వినటంలేదు. పేపర్లో చదవటంలేదు. సిటీలో పట్టపగలు దొంగతనాలు జరుగుతున్నాయి. హత్యలు జరుగుతున్నాయి. రేప్‌లు జరుగుతున్నాయి. ఈవ్‌టీజింగ్‌కూడా చేస్తారు. మెడలో గొలుసుంది. చెవిలో లోలాకులున్నాయి. చేతిలో రెండు బంగారు గాజులు ఉన్నాయి. అరిచినా ఈ సమయంలో ఎండకి ఎవ్వరూ బయటకురారు.

మా ఊర్లో అయితేనా రాత్రివూటకూడ ఎవరింటికైనా వెళ్ళినా ధైర్యంగా తిరిగి రాగలను. ఈ అబ్బాయి అల్లరిపెట్టడానికే అనుసరిస్తున్నాడేమో. అతను పిలుస్తున్నా జవాబేమీ ఇవ్వకుండా వేగాన్ని పెంచాను.

అతను నన్ను అనుసరిస్తూనే ఉన్నాడు. భయం వేస్తోంది. ఇతను మా ఇంటిదాకా అనుసరిస్తే, మా ఇంటి అడ్రస్ తెలిసిపోతుంది. తర్వాత ఎప్పుడైనా ఇంటికి రావచ్చు. అతను అమ్మానాన్నలతో నా కోసం వచ్చానని చెప్తే, అతనెవరో నాకు తెలియదు అని చెప్పినా అమ్మానాన్న నమ్మరు. నన్నే తిడ్తారు. కాలేజి చదువు వద్దు అని చెప్పి ఇంట్లో కూర్చోబెడతారు.

"అరటాకు వెళ్ళి ముల్లు మీద పడినా ముల్లు వెళ్ళి అరిటాకు మీద పడినా అరిటాకుకే నష్టం. అరిటాకులాంటిది జీవితం. కాబట్టి ఆడపిల్ల ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. రోడ్డుమీద నడుస్తుంటే అబ్బాయిలు ఏమైనా అన్నా తలవంచుకొని, వచ్చేయాలి" అంటుంది అమ్మ.

ఒక ఆలోచన వచ్చింది. నేను సందులన్నీ బాగా తిరగాలి. ఇతనుకూడా తిరుగుతాడు. ఇప్పుడే ఇంటికి వెళ్ళకుండా తిరుగుతూ ఉండాలి. అతని కాళ్ళు నొప్పులు పుట్టి, బోర్‌కొట్టి అతనే పారిపోతాడు. నా బుర్రను నేనే అభినందించుకున్నాను.

వెంటనే ఎడమవైపు సందు తిరిగాను. ఆ అడుగులు కూడ అటే తిరిగాయి. కొంత దూరం నడిచాక మరోసందు కుడివైపుకు తిరిగాను. అతను కూడా అటే తిరిగాడు. ఇక సందేహం లేదు. ఇతను నన్ను అనుసరిస్తున్నాడు.

నాగుండె నిమిషానికి డెబ్బైరెండుసార్లు కాదు మాట వరుసకి నాలుగు సార్లు కొట్టుకుంది. అసలే వేసవి కాలం, చెమటతో బ్లౌజు వోణీ తడిసిపోయాయి. మళ్ళీ ఇంకో సందు తిరిగాను. అతను కూడా తిరిగాడు.

మనసులో దేవుణ్ణి ప్రార్థించుకున్నాను. అసలే నాకు భయం ఎక్కువ. మా క్లాస్‌మేట్స్‌కూడ బనాయిస్తూ ఉంటారు. ఏడుపు వచ్చేటట్లుంది. ఇంకో సందులోకి తిరిగాను. అతను కూడ అటే వచ్చాడు. ఈ సందులోనే నా స్నేహితురాలు కవిత ఇల్లుంది. కవిత గుర్తుకు రాగానే ఒక ఆలోచన వచ్చింది. కవిత ఇంటికి వెళ్లాలి. సాయంత్రం వరకు అక్కడే గడపాలి. అదే మా ఇల్లనుకొని, తిరిగి వెళ్ళిపోతాడు. సాయంత్రం మనుష్య సంచారం కూడ ఉంటుంది. అమ్మ అడిగితే కవిత ఇంటికి వెళ్లానని చెప్పవచ్చు.

ఆలోచన వచ్చిన వెంటనే నాకాళ్లు కవిత ఇంటి వైపు దారి తీసాయి. కవిత ఇంటి తలుపు వేసి ఉంది. కాలింగ్ బెల్ నొక్కాను. కవితకు కూడా సెలవులు కదా. అసలు ఊర్లో ఉందో లేదో. కలిసి చాలా రోజులైంది. లేకపోయినా ఆంటీ ఉన్నారుగా.

'ఏమండీ' ఆ అబ్బాయి నాకు దగ్గరగా వచ్చి, నిల్చొని పిలుస్తున్నాడు. ఎంత ధైర్యం, నాకు అసలు అబ్బాయిలతో పరిచయం చేసుకోవడం ఇష్టంలేదు. నేను చదువుతున్నది అమ్మాయిల కాలేజీలో.

ఇంతలో కవిత ఇంటి తలుపు తెరచుకున్నది, వెంటనే లోపలికి వెళ్లి గడియ పెట్టాను. ఆంటీ నా వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. వెళ్లి ఒక కుర్చీలో కూర్చొని కళ్లు మూసుకున్నాను.

'లతా ఏమిటి అలా కంగారు పడుతున్నావు, ఏమైంది?'

'కవిత లేదా ఆంటీ'

'సెలవులు కదా మా అమ్మవాళ్ల ఊరు వెళ్లింది. అసలేం జరిగింది.'

'ముందు మంచినీళ్లివ్వండి.'

ఆంటీ మంచినీళ్లు తెచ్చిచ్చారు. మంచినీళ్లు త్రాగేసి ఎవరో రౌడీ నన్ను అనుసరిస్తూ వచ్చాడని చెప్పాను. 'మంచి పని చేశావమ్మా మా ఇంటికి వచ్చి, ఈ ఇల్లు నీదే అనుకో!

ఆంటీ తలుపు తెరవబోతుంటే 'వద్దాంటీ తెరవద్దు' అన్నాను.

'నేనుండగా ఎందుకమ్మా భయం, నేను మాట్లాడుతానుగా' అన్నారు.

తలుపు తీసేసరికి, ఆ అబ్బాయే నిల్చొని ఉన్నాడు. 'ఏమండీ రాజారావుగారిల్లు ఎక్కడ?' అడిగాడు ఆంటీని.

'ఇక్కడ రాజారావు పేరుగల వాళ్ళెవ్వరూ లేరు.'

'మీఇంటి ప్రక్కనే అని చెప్పారు. ఎవరో మీ అమ్మాయిని చూపించి, వెళ్తుంది కదా ఆ అమ్మాయితో వెళ్ళండి. ఆ అమ్మాయి వాళ్ళ ప్రక్కిల్లు అన్నారు. చాలా నడిచాను, ఇంత దూరముంటుందని వాళ్ళు చెప్పలేదు. రాజారావుగారింట్లో కొబ్బరిచెట్టుంది అన్నారు. కాని ఈ ప్రక్కింట్లో ఎటు ప్రక్క ఇంట్లోను లేవు' అన్నాడు.

ఆంటీ నవ్వుతున్నారు, నేను సిగ్గుతో తలవంచుకున్నాను, నా భ్రమకి.

'ఎంత భయపడ్డావమ్మా, రాజారావుగారిల్లు మీ ప్రక్కిల్లట చూపించు' అన్నారు.

ఆంటీ దగ్గర సెలవు తీసుకొని అతనితో బయలుదేరాను.

'మీరు భయపడ్డారట! సారీ అండీ నేను హైద్రాబాద్‌కి కొత్త, మీ ప్రక్కిల్లంటే మీ వెనకాల వచ్చాను.' 'మీరు నన్ను క్షమించాలి మిమ్మల్ని అపార్థం చేసుకుని, కావాలనే సందులన్నీ తిప్పించి, మిమ్మల్ని నడిపించాను.' అని చెప్పి అతనికి రాజారావుగారిల్లు చూపించి, ఇంటికి వెళ్ళాను, నాలో నేనే నవ్వుకుంటూ. ఇంట్లో అడుగు పెట్టిన నన్ను ఆశ్చర్యంగా చూసింది ఇదేమీ తెలియని అమ్మ అర్థం కాక.

—డాక్టర్. షహనాజ్ బతుల్.